

నేడు కేంద్ర మంత్రి
రామ్మోహన్‌నాయుడు రాక

ప్రజాశక్తి - కడప అర్బన్



కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారాపు రామ్మోహన్ నాయుడు మంగళవారం కడపకు రానున్నారు. కలెక్టర్ కార్యాలయం సభా భవన్‌లో నిర్వహించే పిఎం కిసాన్ పథకం నిధులు విడుదల కార్యక్రమంలో పాల్గొననున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా అధికారులు చేస్తున్నారు.

సమస్యల వలయంలో మినీ గురుకులం

- బడి వైపు కన్నెత్తి చూడని ప్రాజెక్టు ఆఫీసర్
- రెగ్యులర్ హెచ్‌ఎం లేక అవస్థలు
- సిలబస్ పూర్తి చేయడంలోనూ నిర్లక్ష్యం
- నర్స్ లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు



అనంతరాజుపేటలోని మినీ గురుకుల గిరిజన బాలికల పాఠశాల

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

తమ పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పిస్తారని కొండంత ఆశతో విద్యార్థులను గురుకులానికి పంపుతున్న గిరిజన తల్లితండ్రులకు నేడు నిరాశే మిగులుతుంది. ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో ఏర్పాటు చేసి నడుపు తున్న మినీ గురుకులం నేడు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. రైల్వేకోడూరు మండల పరిధిలోని అనంతరాజుపేట పంచాయతీలోని మినీ గురుకుల గిరిజన బాలికల పాఠశాలలో సుమారు 180 మందికిపైగా విద్యార్థులు హాస్టల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో రైల్వేకోడూరు, ఓబులవారిపల్లి చిట్వేలు, పుల్లంపేట మండలాల్లో గిరిజనులు (యానాదులు) 30 వేలకుపైగా జీవనం సాగిస్తున్నారు. వీరి కుటుంబాల్లోని విద్యార్థులకు నాణ్యమైన వసతితో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో గతంలో ప్రభుత్వం మినీ గురుకులం ఏర్పాటు చేసింది. పాఠశాలలో చేరే బాలికల సంఖ్య క్రమంగా ప్రతి ఏటా పెరుగుతుంది. 2011 నుంచి పాఠశాలను ప్రారంభించారు. గురుకులంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. వంట మనిషి, నర్స్, అరకొర విద్యా బోధన, శాశ్వత ప్రధానోపాధ్యాయులు వంటి సమస్యలు ఉన్నారు. గురుకులానికి చాలా కాలంగా పర్మినెంట్ హెచ్‌ఎం లేక ఏళ్ల తరబడి ఇన్‌ఛార్జితోనే కొనసాగడంతో అజమాయిషీ కరువై ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయుల్లో భాధ్యత కొరవడి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాలుగవ తరగతి ఉద్యోగులైన వంట మనిషులకు సరైన వేతనాలు ఇవ్వకపోవడంతో ఎవరు కూడా విధుల్లో చేరిన పది రోజులు కూడా ఉండటం లేదు. వంట చేసే సందర్భంలో విద్యార్థులే వంట మనిషి పాత్ర పోషిస్తున్నారు. విద్యార్థులు వంట సహాయకులుగా ఉంటుండటంతో వారి విద్య కుంటుపడుతోంది. కొందరు ఉపాధ్యాయుల వల్ల బాలికలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులను కులం పేరుతో దూషించడం, అసభ్యంగా మాట్లాడటం, సక్రమంగా పాఠాలు బోధించడంలో కొందరు ఉపాధ్యాయుల్లో నిర్లక్ష్యం దోరణి ఎక్కువగా ఉంటోంది. ఉపాధ్యాయులు తమ పిల్లలను స్కూలుకు తీసుకురావడంతో సిలబస్‌పై దృష్టి సారించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బోధించడానికి ఇబ్బందిగా మారి వారి పిల్లలను ఆలన పాలనలో ఎక్కువ సమయం గడుపుతూ సిలబస్ బోధించే విషయం పూర్తిగా విఫలమైందనే విమర్శ ఉంది. గత ఏడాదిలో పూర్వ విద్యార్థులు ఇప్పుడు ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చేరే బాలికలు ఆందోళనల వ్యక్తం చేస్తున్నారు. సోషియల్, హిందీ, మ్యాథమెటిక్స్ పూర్తిస్థాయిలో బోధించకుండా ఆన్‌లైన్ క్లాస్‌లు వినమని చెప్పడంతో విద్యార్థులు విసుగెత్తి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదో తరగతిలో మార్కులు చాలా తక్కువ రావడంతో ఎంపిసి, బైపిసి సబ్జెక్టులు తీసుకునే పరిస్థితి లేదు. ఆర్ట్స్ గ్రూప్ తీసుకొని మేము ఇంటర్‌లో చేరుతున్నామని బాలికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇప్పుడు చదువుతున్న బాలికలకు సరైన చదువు చెప్పాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇన్ని సమస్యలు ఇక్కడ తిష్ట వేసినా నెల్లూరులో ఉంటున్న ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం బాధాకరం. మినీ గురుకుల గిరిజన బాలికల సమస్యలపై ఎప్పుడు పరిష్కారం చేయాలనే ఆలోచన చేయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాజెక్టు అధికారికి చీమ కుట్టినట్లు లేకపోవడం చాలా దారుణమని గిరిజన సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్స్ లేకపోవడంతో విద్యా ర్థులు అనారోగ్యం బారిన పడినప్పుడు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గత విద్యా సంవత్సరం నుండి పైసమస్యలు గురుకులంలో తిష్ట వేసినప్పటికీ విద్యా ర్థులు సర్దుబాటు చేసుకుని విద్యాభ్యాసం కొనసాగుతున్నారు. ఇప్పుడు కూడా ఆ పరిస్థితి కనబడుతుంది. ఇప్పటికైనా ఇక్కడ నెలకొన్న సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి బాలికల తలితండ్రులు కోరుతున్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం



నాలుగో తరగతి ఉద్యోగులు సమస్య ఉంది. ఈ ఏడాది ఆ సమస్య రాకుండా ఉండేందుకు పరిష్కారం కోసం కృషి చేస్తా. పాఠశాలలో ఉపాధ్యాయులు సిలబస్‌ను పూర్తి చేసి విధంగా చర్య తీసుకుంటా. బాలికలకు మంచి విద్య అందించడానికి నా వంతు నేను కృషి చేస్తా.

- బి.లతలి, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం, మినీ గురుకుల గిరిజన బాలికల పాఠశాల, రైల్వేకోడూరు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి



గిరిజన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల్ని తక్షణమే శాశ్వత ప్రాతిపదికగా పరిష్కరించాలి. అక్కడ ఖాళీగా ఉన్న పోస్టులు వెంటనే భర్తీ చేసి విద్యార్థులకు పనిభారం లేకుండా, భద్రత కల్పించాలి. పోషకాహారం అందివ్వడంతో పాటు ఉపాధ్యాయుల ఇష్టారాజ్యానికి ఫుల్ స్టాప్ పెట్టాలి. లేకపోతే విద్యార్థుల తల్లితండ్రులతో కలిసి ఆందోళనలు చేపడతాం.

- జలకం శివయ్య, జిల్లా అధ్యక్షులు, యానాదులు (గిరిజన) సంక్షేమ సంఘం, అన్నమయ్య జిల్లా.

ఘనంగా బక్రీద్ వేడుకలు

- కడప నగరంలోని ఈద్గాల్లో ప్రార్థనలు



రామాంజనేయపురం వద్ద ఉన్న ఈద్గాలో ముస్లిముల ప్రార్థనలు



బిల్టప్ వద్దనున్న ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లిం సోదరులు

ప్రజాశక్తి - కడప అర్బన్

బక్రీద్ పండుగ సందర్భంగా కడప నగరంలోని బిల్టప్ దగ్గరలో ఉన్న ఈద్గా మైదానంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కడప అమీన్ పీర్ పెద్ద దర్గా పీఠాధిపతి ఆరిపుల్ల హుసేని, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు విఎస్ అమీర్ బాబు ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాసరెడ్డి, అమీర్ బాబు మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీ సోదరులందరూ బక్రీద్ పండుగ జరుపుకుని అందరూ సుఖ సంతోషాలతో, ఆయు రారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడును అఖండ మెజార్టీతో గెలిపించిన రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీ సోదరులందరికీ, అన్ని వర్గాల ప్రజలందరికీ ఆ అల్లా ఆశీస్సులు అన్నివేళలా ఉండాలని చెప్పి ప్రత్యేకమైన ప్రార్థనలు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ . వి ఎస్ ఆదిల్, రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాసర్ అలీ, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

నగర శివారులో ఘోర రోడ్డు ప్రమాదం

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న కారు
కారు డ్రైవర్‌తోపాటు మరొకరు మృతి
మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



కారులోనే మృతి చెందిన డ్రైవర్ రామయ్య, సాయిగురురోహిత్

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగర శివారు ప్రాంతమైన రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కడప-చెన్నై ప్రధాన రహదారిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా ప్రయాణిస్తున్నటువంటి బస్సును కారు ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు గాయాల పాలయ్యారు. పోలీసుల కథనం మేరకు.. సోమవారం ఉదయం కడప మండలం ఉక్కాయపల్లి చెందిన దాది బోయిన రాజమోహన్ అలియాస్ రాజా, తన భార్య లక్ష్మీదేవి, కుమారుడు సాయి గురు రోహిత్ (25)తో కలిసి అద్దెకు కారు తీసుకుని కడప కో-ఆపరేటివ్ కాలనీ చెందిన డ్రైవర్ దూది రామయ్య(55)తో కలిసి పోరుమామిళ్ల దగ్గర ఉన్నటువంటి గుర్రప్ప కొండకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో కడప నగర శివారులోని డిఆర్‌డిఎ భవనం సమీపంలోకి రాగానే కడప నుంచి తిరుపతి వైపు వెళ్తున్న ఆర్‌టిసి బస్సును కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న డ్రైవర్ రామయ్యతోపాటు, రాజమోహన్ కుమారుడు సాయి గురు రోహిత్ అక్కడికక్కడే మృతిచెందారు. ఉక్కాయిపల్లి రాజా, అతని భార్య లక్ష్మీదేవి తీవ్ర గాయాల పాలయ్యారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే కడప రిమ్స్ ఎస్ఐ నారాయణ, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను, గాయాల పాలైన ఇద్దరిని రిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. రాజా కుటుంబానికి ప్రమాదం చోటు చేసుకోవడంతో ఉక్కాయిపల్లి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొన్నాయి. ఈ ఘటనపై కడప రిమ్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి గురైన బస్సు

తెలుగు లిపి పరిణామ

పరిశోధనలో మేటి 'తిరుమల రామచంద్ర'



తిరుమల రామచంద్ర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిబ్రౌన్ గ్రంథాలయ సిబ్బంది

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సోమవారం ఉదయం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో తిరుమల రామచంద్ర 112వ జయంతిని నిర్వహించింది. ముందుగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ పాత్రికేయులుగా, సంపాదకులుగా, కవిగా, నాటకకర్తగా, విమర్శకులుగా, భాషావేత్తగా, అనువాదకులుగా అనేక ప్రక్రియల్లో రచనలు చేసినప్పటికీ తిరుమల రామచంద్ర తనను తాను ఎంతో వినయంతో 'భాషా సేవకుడను' అని అభివర్ణించుకునేవారన్నారు. తిరుమల రామచంద్ర శ్రీకృష్ణదేవరాయల కులగురువైన తిరుమల తాతాచార్యుల వంశీకులని, ఆయన తెలుగుతో పాటు కన్నడ, తమిళ, సంస్కృత, ప్రాకృతాది భాషల్లో ప్రావీణ్యం కలిగిన బహుభాషావేత్త అని అన్నారు. ఆయన పలురకాల వృత్తులు చేయడం ద్వారా, భారతదేశంతోపాటు ఆఫ్ఘనిస్థాన్, బెలూచిస్థాన్ వంటి దేశాలు తిరిగి, వివిధ సంస్కృతుల పట్ల చక్కని అవగాహన ఏర్పరచుకున్నారని అన్నారు. ఆయన విద్యార్థిదశలో గాంధీని చూసి ప్రభావితులై స్వాతంత్ర్య సమరంలో పాల్గొని జైలుకు వెళ్లారని అన్నారు. ఆయన ఇతర భాషల్లోని పలు రచనలను తెలుగులోకి అనువదించిన గొప్ప అనువాదకుడని అన్నారు. గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు మాట్లాడుతూ తిరుమల రామచంద్ర ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఆంధ్రభూమి ,హిందుస్తాన్ సమాచార్, భారతి పత్రికలలో వివిధ హోదాలలో పనిచేశారని, పరిశోధన అనే ద్వైమాసపత్రికకు సంపాదకత్వం వహించారని అన్నారు. రచయిత కొత్తపల్లె రామాంజనేయులు మాట్లాడుతూ రామచంద్ర మనిషి రూపంలోని విజ్ఞాన సర్వస్వమని, నిరాడంబరంగా ఉంటూ ఎప్పుడూ ఖద్దరు వస్త్రాలు ధరించేవారని అన్నారు. ఆయన రచించిన నుడి, నానుడి, మనలిపి పుట్టు పూర్వోత్తరాలనే గ్రంథాలు భాషాశాస్త్రంలో చాలా విలువైన గ్రంథాలని అన్నారు. 'సరస్వతీపుత్ర' పుట్టపర్తి నారాయణాచార్యులు, రామచంద్ర తిరుపతి శ్రీవేంకటేశ్వర సంస్కృత కళాశాలలో కలసి చదువుకున్నారని అన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు రంగా, రాజేష్, దిలీప్, నాగరాజు పాల్గొన్నారు.

చిరస్మరణీయులు చిలకమర్తి లక్ష్మీ నరసింహం

- ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

కవి, రచయిత, నాటక కర్త, పాత్రికేయులు, సంఘసంస్కర్త, విద్యావేత్త అయిన చిలకమర్తి లక్ష్మీనరసింహం చిరస్మరణీయులని, ఆయన్ను అఖండమైన కీర్తి తెచ్చింది ఆయన రాసిన గయోపాఖ్యాన నాటకమేనని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో సోమవారం చిలకమర్తి 78వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలకమర్తి 22 సంవత్సరాల వయస్సులో రాసిన గయోపాఖ్యానం ప్రతులు అప్పట్లోనే లక్షకు పైగా అమ్ముడుపోవడం విశేషం అన్నారు. మధురకవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి ప్రసంగిస్తూ ఆంధ్ర మిల్టన్‌గా ప్రసిద్ధులైన చిలకమర్తి ఆ కాలంలోనే దళితులకు ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. డాక్టర్ పాలెం వేణుగోపాల్ మాట్లాడుతూ ఆయన ఎన్ని కథలు, నవలలు, నాటకాలు, అనువాదాలు రాసిన గయోపాఖ్యానమే మంచి కీర్తి తెచ్చింది అన్నారు. సత్యనారాయణ చిలకమర్తి ఆసువుగా చెప్పిన పద్యాలనుచక్కగా ఆలపించారు. గయోపాఖ్యానం నాటకం లో ప్రసిద్ధ పాత్రలు పోషించి పేరు తెచ్చుకున్న ఆమూరు విశ్వనాథరెడ్డి,భూమిరెడ్డి పోలిరెడ్డి, సురభి రామచంద్రయ్య, కర్నాటి నరసింహ రెడ్డి, పట్నం సుబ్బరాయుడులను ఘనంగా సన్మానించారు. రంగస్థల కళాకారులైన మందల మురళి, బ్యాంకు గంగయ్య, తిప్పలూరు ఓబులేసు, బాల ఓబయ్య, శ్రీనివాసరాజు, తపలిస్ట్ గంగయ్య, రవీంద్రనాథ్ రెడ్డి గయోపాఖ్యానం నాటకంలోని పద్యాలను మధురంగా గానం చేశారు.

కుటుంబ సంక్షేమ పథకం రాష్ట్ర ట్రెజరర్‌గా లక్ష్మీరాజ

ప్రజాశక్తి-కడప అర్బన్ : యుటిఎఫ్ రాష్ట్ర మధ్యంతర కౌన్సిల్ సమావేశాలు నెల్లూరు పట్ట ణంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి స్మారక విజ్ఞాన కేంద్రంలో రెండు రోజులపాటు నిర్వహించారు. ఈ సమావేశాలలో యుటిఎఫ్ రాష్ట్ర కుటుంబ సంక్షేమ పథకాన్ని రాష్ట్ర సంఘం ప్రవేశపెట్టింది. ఈ పథకానికి రాష్ట్ర ట్రెజరర్‌గా కడప జిల్లాకు చెందిన రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన ఎన్నిక పట్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర కుటుంబ సంక్షేమ పథకంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా ఆఫీస్ బేరర్లు సభ్యులుగా ఉంటారని ఇందులో సభ్యత్వం కలిగిన ఉపాధ్యాయులు మరణించినా, ప్రమాదాలలో తీవ్రంగా గాయపడినా, అనారోగ్యాల పాలైన ఆర్థికంగా ఆదుకుంటారని తెలిపారు. కుటుంబ సంక్షేమ సంఘం ఉపాధ్యాయుల కుటుంబానికి భరోసాను కల్పించే విధంగా ఉంటుందని, ఈ పథకంలో సభ్యులైన వారు 75 సంవత్సరాల వయస్సు వరకు కొనసాగవచ్చునని తెలిపారు.

కడప నగర సమస్యలను పరిష్కరించండి

కడప అర్బన్ : కడప శాసనసభ నియోజకవర్గానికి నూతనంగా శాసన సభ్యురాలిగా ఎన్నికైన మాధవిని కలిసి అఖిల భారత అభ్యుదయ వేదిక జిల్లా నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా వారు కడప నగరంలో నెలకొన్న పలు సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో కడప నగరాన్ని మంచి ప్రగతి పథంలో నిలుపగలరని ఆమెకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మాధవి స్పందిస్తూ కడప నగర అభివృద్ధి రాబోయే 5 సంవత్సరాల కాలంలో ప్రణాళికా బద్ధంగా తనవంతు కృషిచేసి కడప నగరాన్ని ప్రగతి పథంలో నిలుపుతానని అన్నారు. అందరి సహాయ సహకారాలు తీసుకుని ముందుకు వెళ్తామన్నారు. ఎమ్మెల్యేను కలిసి అభినందించిన వారిలో అభ్యుదయ వేదిక రాష్ట్ర నాయకులు కె.సురేష్ బాబు, జిల్లా అధ్యక్షుడు బి. విశ్వనాథ, ప్రధాన కార్యదర్శి పి.శంకరయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు యస్.మహబూబ్ బాషా, పి. హైదర్ అలీ, కె.గౌరీశంకర్, బి.కృష్ణ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని లింగారెడ్డిపల్లి పంచాయతీలో ఇటీవల వర్షాలు కురవడంతో నీటి నిల్వ ఉండి ఈగలు, దోమలు విపరీతంగా ప్రజలపైకి దండయాత్ర మొదలు పెట్టాయి. వీటి ద్వారా చిన్నారులకు, పెద్దలకు జ్వరాలు వచ్చే సూచనలు ఎక్కువగా ఉన్నాయి. కుటుంబాలలో దోమల స్వైరవిహారంతో వృద్ధులు ఉండలేని పరిస్థితి. అన్ని కుటుంబాలలో ఈగల దోమల నివారణకు స్ప్రే చేయించి, రానున్న సీజనల్ వ్యాధుల నుండి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని సచివాలయ పంచాయతీ సెక్రటరీ మరియు సర్పంచుల నేతృత్వంలో దోమల నివారణకు తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎపిఒ శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో 2000 మంది ఉపాధి కూలీలతో, పంట కాలువలు చేపల పెంపకం కోసం కుంటలు, కొండ ప్రాంతాలలో నీరు నిల్వ ఉంచడానికి డకౌట్ ఫండ్స్, ఖండిత కందకాలు, మొదలగు పనులు చేపట్టామని అన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఉపాధి కూలీ ఈ పనులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మంత్రి 'మండిపల్లి'ని కలిసిన ఎన్‌జిఒ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్



మంత్రిని సన్మానిస్తున్న ఎన్‌జిఒ నాయకులు

రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని రాయచోటిలో ఎపి ఎన్‌జిఒ నాయకులు, ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, రాయచోటి తాలూకా అధ్యక్షులు ఎం.వేణుగోపాల్ రెడ్డి, కార్యదర్శి డి.వెంకటేశ్వర్ రెడ్డి సోమవారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యోగులకు ఎలాంటి సమస్యలున్నా మీకు అండగా ఉంటానన్నారు. ఉద్యోగులు ప్రభుత్వ పథకాలను ప్రజలకు సకాలంలో అందిం చాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లా కోశాధికారి పి.నిత్యపూజయ్య, ఉపాధ్యక్షులు టి.శ్రీనివాసులు, నరసింహ రెడ్డి, యన్.రాజశేఖర్, రాయచోటి ఎన్‌జిఒ నాయకులు బి.దేవేంద్ర, మహాదేవ, గణేష్ యాదవ్, అల్లీ బాష, కడప సిటీ అధ్యక్షులు కె.చిన్నయ్య, కార్యదర్శి శైలేశ్వర్‌రెడ్డి, నాగార్జునరావు, పద్మనాభరావు, లక్కిరెడ్డిపల్లి అధ్యక్షులు కె.బలరామ రాజు, ఉపాధ్యక్షులు సి.విశ్వనాధం పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్‌ను సత్కరించిన జహంగీర్

గోపవరం : రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూఖ్ ను ఆదివారం నంద్యాల లోని ఆయన క్యాంపు కార్యాలయంలో తెలుగుయువత కడప జిల్లా ఉపాధ్యక్షులు జహంగీర్ బాషా కలసి పూలమాలలు, శాలువాతో సత్కరించి మెమోంటోను అందజేశారు. అనంతరం జహంగీర్ బాషా మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి రాష్ట్ర మంత్రి వర్గంలో ఫరూఖ్ మంత్రి పదవి దక్కించు కోవడం హర్షణీయమన్నారు. ఫరూఖ్ నేతృత్వంలో మైనార్టీలు అభివృద్ధి చెందుతారంటూ ఆయన ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కంభం శివానంద రెడ్డి, సిరిగిరిపల్లె ముస్తఫా, కెఒబి రసూల్, మహబూబ్ బాషా, రఫీ మారయ్య పాల్గొన్నారు.

ఆర్‌సిఎం ఎయిడెడ్ పోస్టుల

అక్రమాలపై న్యాయ విచారణ చేపట్టాలి

-మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపాక వినోద్‌కుమార్

ప్రజాశక్తి- కడప అర్బన్



బిషప్‌తో మాట్లాడేందుకు వచ్చిన ఉపాధ్యాయులు, మాల మహానాడు నాయకులు

ఆర్‌సిఎం ఎయిడెడ్ పాఠశాలలలో 25 సంవత్సరాలుగా తక్కువ జీతాలతో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పోస్టింగ్స్ ఇవ్వకుండా బిషప్ గాలి బాలిరెడ్డి అన్యాయం చేస్తున్నారని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపాక వినోద్ కుమార్ విమర్శించారు. కడప మరియాపురం చర్చి దగ్గర నుంచి బిషప్ హౌస్ వరకు ర్యాలీ నిర్వహించారు. బిషప్ హౌస్ వద్ద నిరసన తెలియజేసేందుకు ప్రయత్నించగా పోలీసులు వారించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఎయిడెడ్ పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వచ్చిందని పేర్కొన్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో కడప డయాసిస్ ఆర్‌సిఎంలో దాదాపు 20 సంవత్సరాల తరువాత ఎయిడెడ్ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నుంచి అనుమతి వస్తుందని చెప్పారు. అర్‌సిఎం డయాసిస్‌లోని పాఠశాలలకు దాదాపు 29 ఉద్యోగాలకు అనుమతి వచ్చిందన్నారు. అందులో ఎస్‌జి టి15, బిఈడి -14 మొత్తం-29. అన్ ఎయిడెడ్ ఉప్యాయులైన తాము సుమారుగా 23 సంవత్సరాల నుంచి కేవలం రూ.600 నుంచి రూ.4 వేలు చాలీ చాలని జీతంతో మన ఆర్‌సిఎం సంస్థలో ఎప్పటికైనా ఎయిడెడ్ పోస్ట్ వస్తుందనే నమ్మకంతో గంపెడు ఆశతో, అంగ వైకల్యాన్ని లెక్క చేయక ఎన్నో కిలోమీటర్లు ప్రయాణించి, తమజీవితాల కోసం పనిచేస్తూ వచ్చారన్నారు. ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది అంటే తమ అదృష్టంగా భావించామని తెలిపారు. ఇన్ని ఏళ్ల కష్టానికి ప్రతిఫలం దక్కుతుందని ఆశించామని పేర్కొన్నారు. అయితే బిషప్ వారి ఆశలు నిరాశలుగా మార్చాలని ఆవేదన వ్యక్తం చేశారు.ఆర్‌సిఎం సంస్థలలో పనిచేయని, రోస్టర్ పాయింట్స్‌లో లేని కొత్త వ్యక్తుల నుంచి ఒక్కొక్క పోస్ట్ కు రూ 30 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు మాకు రావలసిన ఉద్యోగాలను ఇప్పటికే 12 ఉద్యోగాలను అమ్ముతున్నట్లు ఆరోపించారు. మరికొన్ని ఉద్యోగాలను కమిటీలో ఉన్న ఫాదర్స్ కుటుంబీకులకు, బంధువులకు బిషప్ గాలి బాలిరెడ్డి, రెండవ బిషప్ డ్రైవర్ జార్జ్ సిఫార్సు తో కొన్ని ఉద్యోగాలను ఇప్పటికే ఇచ్చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో బాధిత ఉపాధ్యాయులకు చాలా ఆందోలనలకు, మానసిక క్షోభకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు నష్టం వాటిల్లితే బిషప్ బాధ్యత వహించాలని చెప్పారు. కార్యక్రమంలో బాధిత ఉపాధ్యాయులు కవిత, ప్రమీలారాణి, వెంకటసుబ్బయ్య,శేఖర్, ప్రమీల,ఎల్లయ్య పాల్గొన్నారు.

కడపను వైఎస్ఆర్ జిల్లాగా మార్చడం జిల్లా వాసులకు నచ్చలేదు

ప్రజాశక్తి-అట్లూరు : కడప అనే పేరు వినగానే అది ఒక ధైర్యం, అది ఒక నమ్మకం, అది ఒక తెలియని అనుభూతి, ఆప్యాయత, అది ఒక రాయలసీమ మర్యాదని, కడప జిల్లాకు గత వైసిపి ప్రభుత్వం వైఎస్ఆర్ జిల్లా పేరు మార్చడం బాధాకరమని, ప్రజలకూ వ్యతిరేకించారని టిడిపి కడప పార్లమెంట్ మహిళా అధ్యక్షులు పాల కొండు సుధారాణి పేర్కొన్నారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ గతంలో బిజీ వేముల వీరారెడ్డి అనేకమార్లు మంత్రిగా ఉన్నారని, అప్పట్లో ఎన్‌టి రామారావుతో పోరాడి తెలుగుగంగ రిజర్వాయర్‌కు రూపకల్పన చేశారన్నారు. అనేక విద్యాసంస్థలు నెలకొల్పి కడప జిల్లా వాసులకు ఉన్నత విద్యను అందించి ఎందరినో ఉన్నత స్థానాలకు చేర్చారని గుర్తు చేశారు. లక్కిరెడ్డిపల్లి రెడ్డప్ప గారి రాజగోపాల్ రెడ్డి కూడా మంత్రిగా ఎన్నో మంచి పనులు చేశారని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఇంకా పలువురు మంత్రులుగా, ముఖ్య మంత్రు లుగా కడప జిల్లా ఖ్యాతీని విస్తరించారని పేర్కొన్నారు. కానీ ఎవరికీ కడప జిల్లా పేరును మార్చాలనే దూరాలోచన కల్గలేదని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే వైఎస్ఆర్ జిల్లాగా మార్చడం దారుణమన్నారు. ఇప్పుడు అందరు పార్టీలకు అతీతంగా కడప జిల్లా పేరును పునరుద్ధరించుకోవడానికి కృషి చేయాలని ఆమె కోరారు.



ఎమ్మెల్సీకి అభినందనలు తెలుపుతున్న విద్యుత్ అధికారులు

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథిగృహానికి వచ్చిన ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డికి ప్రజలు, కార్యకర్తలు వారి సమస్యల గురించి వినుతులను సమర్పించారు. ఇందుకు స్పందించిన ఆయన వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలోని విద్యుత్ శాఖ అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రైతులు విద్యుత్ శాఖకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకు రాగా ఆయన అక్కడే ఉన్న విద్యుత్ శాఖ అధికారులకు వివరించారు. వాటిని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మైసూరారెడ్డి, రమణారెడ్డి, నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'పుట్టా'కు సిఐ ఘన సన్మానం

ప్రజాశక్తి - ఖాజీపేట



మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను స్థానిక సిఐ రామాంజులు మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రొద్దుటూరులోని తన నివాసంలో పుట్టా సుధాకర్ యాదవ్‌ను సీఐ కలిసి పుష్ప గుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయ సేవలు అందించి లా అండ్ ఆర్డర్‌ను పరిరక్షించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సీఐకి సూచించారు.

బ్రహ్మంగారిమఠం : మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్‌ను ఆయన నివాసం ప్రొద్దుటూరులో సోమవారం మండల టిడిపి నేతలు ప్రముఖ న్యాయవాది పట్టాభి నాయుడు, తిప్పన జయరాం నాయుడు, యువనాయకులు తిప్పన రాజశేఖర్ నాయుడు, తిప్పన ధరమా నాయుడు, వంకర నాగేష్, నాగరాజు, ప్రతాప్, గాంధీ శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.



పోలీస్‌స్టేషన్ వద్ద మాట్లాడుతున్న టిడిపి నాయకులు

వైసిపి నాయకులు నీచ రాజకీయాలు మానుకోవాలి..!

ప్రజాశక్తి - చక్రాయపేట

వైసిపి నాయకులు, తమ మీడియా నీచ రాజకీయాలు మానుకోవాలని చక్రాయపేట మండల టిడిపి ఇన్‌ఛార్జి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చక్రాయపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో మండలంలో జరిగిన ఘటనలకు టిడిపికి ఎలాంటి సంబంధం లేదన్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా తప్పుడు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. తమపై వచ్చిన ఆరోపణలకు ఏ క్షణమైనా విచారణకు సహకరిస్తామని తెలిపారు. విచారించి నిజా నిజాలు బయటకు తీయాలని సిఐ గోవిందరెడ్డి, చక్రాయపేట ఎస్ఐ వినోద్‌కుమార్‌ను కలిసి కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి రాధాక్రిష్ణయ్య, సురభి గ్రామ ఉప సర్పంచ్ దాసరి ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

కూటమి విజయంతో జనసైనికుల సంబరాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని సుందరయ్య నగర్‌లో ఎన్‌డిఎ కూటమి విజయోత్సవంలో భాగంగా సోమవారం జనసైనికులు సంబరాలు చేసుకున్నారు. సుందరయ్య నగర్‌లోని యువత అమృత్, ధీరజ్ ఆహ్వానం మేరకు జమ్మలమడుగు జనసేన కో-ఆర్డినేటర్ దేరంగుల జగదీష్ సంబరాల్లో పాల్గొన్నారు. బాణాసంచా పేల్చారు. అనంతరం కేక్ కట్ చేశారు. జనసేన జగదీష్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, హాజీ మహేష్, మళ్ళీ, వీర, సురేంద్ర, మణి, బాలాజీ, ధీరజ్, సలీం, కళ్యాణ్, సిద్ధూ, అనిల్, అలీ, జిలాని, ఇమ్రాన్, ఉస్మాన్, యాసిన్, ఆరిఫ్ పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్, శిల్పారామంలో చిన్నారులు చేసిన నృత్యాలు ప్రేక్షకులనుఎంతగానో అలరించాయి. సోమవారం డాక్టర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో శ్రీకిషోర్ అకాడమీ కడప బృందం వారిచే క్లాసికల్, జానపద, వెస్టర్న్ మొదలగు నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. శిల్పారామంలో సూర్య అకాడమీ మదనపల్లె వారి ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన సాంస్కృతిక, సంప్రదాయ నృత్య ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి విపరీతమైన స్పందన వచ్చింది. పట్టణం, చుట్టుపక్కల ప్రజలు కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు కిషోర్, సూర్య, పరిపాలన అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

24 మంది జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని నిడుజివ్వి, పొట్లదుర్తి గ్రామ పరిసరాల్లో జూదమాడుతున్న 24 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. నిడుజివ్వి, పొట్లదుర్తి గ్రామ పొలాల్లో పలువురు జూదమాడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేశామన్నారు. దాడుల్లో 24 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.97,530 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

ఆహారం కల్తీమయం.. ప్రజారోగ్యంతో చెలగాటం

హోటళ్లు, ఇతర దుకాణాల్లో అధికారుల నామమాత్రపు తనిఖీలు



ప్రజాశక్తి - పులివెందుల టౌన్

హోటళ్ల మాటున కల్తీ మాయ, బయట దొరకని నాణ్యమైన ఆహారంతో ప్రజారోగ్యం దెబ్బతింటోంది. అపరిశుభ్ర వాతావరణంలో వంటల తయారీ, రంగు, రుచి కోసం ప్రమాదకర రసాయనాల వాడకంతో సరికొత్త రోగాలు దరిచేరుతున్నాయి. గతంలో ఎక్కడికైనా వెళ్లి భోజనం సమయానికి ఇంటికి రాలేని పరిస్థితులు తలెత్తితే హోటళ్లలో తినేవారు. కొందరు ఎంత సమయమైనా ఇంటికే వచ్చి భోజనం చేసేవారు. బయటి ఆహారాన్ని తినేందుకు వారు ఇష్టపడరు. తక్కువ ఖర్చు చేసి, ఎక్కువ దాచుకునేవారు. ఇది ఆర్థికంగానూ, ఆరోగ్యం గానూ మంచి లక్షణమే. ఇప్పుడు ఆ పరిస్థితుల్లేవు. సమాజంలో మనిషి ప్రవర్తనలో చాలా తేడా వచ్చింది. నగరాలు, పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా పార్టీ కల్చర్ వచ్చింది. బర్త్ డే, మ్యారేజ్, ప్రమోషన్, ట్రాన్స్‌పర్ తదితర సందర్భం ఏదైనా పార్టీలు ఇస్తున్నారు. ఇంటి భోజనం కంటే హోటళ్లల్లో ఆహారం తినడానికే ప్రాధాన్యతనిస్తున్నారు. నలుగురు స్నేహితులు కలిస్తే భోజనాలు బయట చేస్తున్నారు. ఖరీదైన ఆహారం తింటున్నామనే భ్రమలో ఉన్నారు. ఆరోగ్యకర, పోషకాహారాన్ని తింటున్నామా.. లేదా.. అనేది గ్రహించలేకపోతున్నారు. నిల్వ ఉంచిన ఆహారం, ప్రమాదకర రసాయనాలు కలిపిన ఆహారాన్ని తీసుకుంటున్నారు. అప్పటికప్పుడు వీటి వల్ల నష్టం లేకపోయినా దీర్ఘకాలంలో ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. హోటల్ ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి అనుమతి తీసుకోవాలి. ఆ శాఖలో నిర్ణీత రుసుం చెల్లించి అనుమతి పొందాలి. కానీ పట్టణంలో ఇలా అనుమతి తీసుకుని వ్యాపారం చేసే సంస్థలు నూటికి 25 శాతానికి మించి ఉండవనేది బహిరంగ రహస్యం. ఇదిలా ఉండగా పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు మినహా అధిక శాతం హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రోడ్డు పక్క హోటళ్లు పరిశుభ్రత గురించి అస్సలు పట్టించుకోవడం లేదు. నాసిరకం ఆహార పదార్థాలు వాడడం, రోజుల తరబడి ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన వాటిని వేడి చేసి విక్రయిస్తున్నారు. ఆహారం వండే ప్రాంతాలూ అపరిశుభ్రంగా ఉన్నా పట్టించుకునే నాథుడు లేడు. పట్టణాల్లో అధిక శాతం మురుగు కాలువలు, చెత్త కుప్పల పక్కన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు దర్శనమిస్తున్నా అడిగే వారు కరువయ్యారు. కల్తీ జరుగుతోంది. ఇలా పాలల్లో కుళాయిలు, బోరు నీటిని కలుపుతారు. పాలల్లో చిక్కదనం కోసం నాసిరకం పాల పౌడర్లు, యూరియా, పిండి, నూనె కలిపి విక్రయిస్తున్నారు. టీ పొడిలో ఇనుప రజను, రంపపు పొట్టు మిశ్రమం చేస్తున్నారు. వీటివల్ల ఊపిరితిత్తులు పాడయ్యే ప్రమాదం లేకపోలేదు. పశువుల ఎముకలను సేకరించి, వాటిని బట్టీల్లో అత్యధిక ఉష్ణోగ్రతపై మరిగించి ద్రావణాన్ని తీస్తున్నారు. ఆ ద్రావణాన్ని సాధారణ నూనెల్లో కలిపి విక్రయిస్తున్నారు. దీనివల్ల జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. చికెన్, మటన్ బిర్యానీలు, తందూరి చికెన్లలో ఆకట్టుకునేందుకు హానికరమైన రంగులను ఎక్కువగా వాడుతున్నారు. అనారోగ్యానికి గురైన, ప్రమాదాల్లో చనిపోయిన గొర్రెలు, పొట్టేళ్లు, మేకలను వధించి వినియోగదారులకు విక్రయిస్తున్నారు.



భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగ వేడుకలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

భక్తిశ్రద్ధలతో బక్రీదు పర్వదినాన్ని సోమవారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని శ్రీరామ థియేటర్ వద్ద, పార్నపల్లి రోడ్డు వద్ద ఉన్న ఈద్గాలలో ఉదయం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

జమ్మలమడుగు రూరల్ : ప్రవక్త ఇబ్రహీం ఖలీలుల్లా త్యాగ నిరతికి చిహ్నంగా



జమ్మలమడుగులో మాట్లాడుతున్న పీఠాధిపతి

ప్రపంచంలోని ముస్లింలంతా నేటి వరకు ఎంతో భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ నిర్వహించుకుంటున్నారని జామియమసీద్ పీఠాధిపతి సయ్యద్ షా సాధిక్ పాష ఖాద్రి పేర్కొన్నారు. స్థానిక పెన్నా నది ఒడ్డున షాహి ఈద్గా మైదానంలో పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాల్లోని ముస్లింలు, చిన్నారులు వేలాదిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతి బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పీఠాధిపతి కుటుంబీకులు, ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నమాజ్ అనంతరం ముస్లింలు ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.

చాపాడు : ఈదుల్ జూహాన్ (బక్రీద్)ను మండల పరిధిలోని ఈద్గా



చాపాడులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిములు

ప్రాంగణాల్లో ముస్లింలు సోమవారం ఆనందోత్సాహాలతో ఘనంగా ఆచరించారు. బక్రీద్ ప్రాముఖ్యతను మత పెద్దలు వివరించారు. మండలంలోని అన్ని మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సత్యం, న్యాయం, ధర్మం, త్యాగం, సహనం, పరోపకారం, బాధ్యతాభావం అలవరచుకోవాలని ప్రజలకు మత పెద్దలు సూచించారు. చాపాడు, కేతవరం, పెద్దగురువలూరు, అల్లాడుపల్లె, మడూరు, వెదురూరు, రాజుపాలెం, తిమ్మాయపల్లె, ఖాదర్‌పల్లె ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వేంపల్లె : త్యాగానికి ప్రతి రూపంగా ముస్లింలు జరుపుకొనే పండుగ ఈదుల్ ఉల్ ఆధా(బక్రీద్) అని మత గురువులు పేర్కొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం స్థానిక షాదీఖానా సమీపంలో ఉన్న ఈద్గాలో, చింతలమడుగుపల్లె, వీరన్నగట్టుపల్లె గ్రామ సమీపంలో ఈద్గా, బిస్మిల్లా మసీదులో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత గురువులు బక్రీద్ పండుగ సందేశాన్ని ఇచ్చారు. జీవితకాలంలో ఒక్కసారైన హజ్ యాత్ర చేయాలనే నియమం ఉందన్నారు. కష్టపడి సంపాదించిన సొమ్ముతో హజ్ యాత్రను చేయాలని కోరారు. సామూహిక ప్రార్థనల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ చాంద్ బాషా ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ముస్లింలకు జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, ఎస్వీ జయరామిరెడ్డి, టిడిపి మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి, పులివెందుల కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ధృవకుమార్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ డాక్టర్ ఎస్ఎఫ్ బాషా బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

ముద్దనూరు : బక్రీద్ సందర్భంగా సోమవారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత బోధకులు బక్రీద్ ప్రాముఖ్యతను వివ రించారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అని, ముస్లింలు దయా, ప్రేమ, జాలి, కరుణ కలిగి ఉండాలన్నారు. ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపు కున్నారు.

ఖాజీపేట : ముస్లింలు బక్రీద్ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఈద్గాల్లో వారు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దుంపలగట్టు గ్రామంలోని ఈద్గాలో కొత్త నెల్లూరు, కొత్తపేట, దుంపలగట్టు గ్రామాల ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైసిపి నేత రెడ్యం వెంకట సుబ్బారెడ్డి ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింలకు రెడ్యం బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

గోపవరం : బద్వేల్- సిద్ధవటం రోడ్డులోని ఈద్గాలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగం, సహనం, మానవత్వానికి ప్రతికగా ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను నిర్వహించుకుంటారన్నారు. సమాజ మార్పును ఉద్దేశించడమేగాక ముస్లిం సోదరుల ఆత్మవిశ్వాసం, నిజాయితీకి ఈ పండగ నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు కార్యక్రమంలో పలువురు ముస్లిం సోదరులు ముస్లిం పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మైదుకూరు : మైదుకూరు పట్టణంలో సోమవారం బక్రీద్ పండగ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ పండగలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, ముస్లింలకు ఎమ్మెల్యే బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.



ఈద్గా వద్ద ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



వేంపల్లె ఈద్గా సమీపంలో ముస్లిముల సామూహిక ప్రార్థనలు



విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న సోమశేఖర్‌రెడ్డి

అంధ విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల రోటరీపురానికి చెందిన వల్లెపు రోజా అనే రెండు కళ్లులేని అంధురాలు తల్లిదండ్రులు లేని అనాథ. ఆమె తన నాయనమ్మ సంరక్షణలో జీవిస్తోంది. డిగ్రీ పూర్తి చేసిన రోజా ఇటీవల ఎడ్ సెట్ ప్రవేశ పరీక్ష రాసి ఎర్రగుంట్ల బిఈడి కళాశాలలో అడ్మిషన్ పొందింది. కోర్స్ ఫీజు ప్రతి సెమిస్టర్‌కు రూ.10వేలు ప్రకారం మొత్తం రూ.40 వేలు చెల్లించాల్సి ఉంది. తాను చదువుకునేందుకు ఆర్థికసాయం చేసే వారు లేక రోజా విద్యను మధ్యలో నిలిపివేయవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని గుర్తించిన వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థ వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ సోమశేఖర్ రెడ్డి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సోమశేఖర్‌రెడ్డి అంధురాలైన విద్యార్థిని రోజా విద్యాభ్యాసానికి అవసరమైన రూ.40 వేల మొత్తాన్ని తానే భరిస్తానని హామీ ఇచ్చారు. మొదటి సెమిస్టర్ ఫీజు రూ.10వేలు వివేకానంద స్కూలు కార్యాలయంలో ఆదివారం విద్యార్థినికి అందజేశారు. సోమశేఖర్‌రెడ్డి సేవా స్ఫూర్తిని సంఘమిత్ర సేవా సంస్థ అధ్యక్షులు సిరాజుద్దీన్ అభినందించారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, చింతలజూటూరు రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి రూ.15 వేలు విరాళం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థాన ఆవరణలోని అన్నదాన సత్రానికి భక్తుల నుంచి రూ.15,341 విరాళంగా వచ్చాయని ఆలయ ఇఒ శ్రీనివాసులు తెలిపారు. ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి సంబంధించి అవసరమైన వంట పాత్రలను సింగిరెడ్డి సుభద్రమ్మ రూ.8వేలకు అందించారన్నారు. అన్నదాన కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటేశ్వర రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ గోసుల వీరారెడ్డి, ఎల్లారెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

తులసిరెడ్డిని కలిసిన ఆళ్లగడ్డ కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డిని ఆళ్లగడ్డకు చెందిన కాంగ్రెసు నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం వేంపల్లెలో ఉన్న తులసిరెడ్డిని ఆళ్లగడ్డకు చెందిన బరుగుడ్ల హుస్సేన్ బాషా కలిసి పార్టీ పరిస్థితులపై చర్చించారు. రాబోవు రోజుల్లో పార్టీ పటిష్టతకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. నిరుత్సాహ పడకుండా పార్టీ కోసం పని చేయాలని తులసిరెడ్డి చెప్పారు. అనంతరం తులసిరెడ్డిని ఆళ్లగడ్డ కాంగ్రెస్ నాయకులు శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, సాదిక్ హుస్సేన్, నజీర్, చాంద్, మాబు బాషా పాల్గొన్నారు.



తులసిరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు



నిరసన తెలుపుతున్న డివైఎఫ్ఐ శివకుమార్, నాయకులు

నీట్ పరీక్ష ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నీట్ - 2024 పరీక్ష ఫలితాలు, నీట్ పరీక్ష నిర్వహణపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుండి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నందున పరీక్ష నిర్వహణ తీరుపై సిట్టింగ్ జడ్జితో విచారణ నిర్వహించి విద్యార్థులందరికీ న్యాయం చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) కడప జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక పాత బస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద సోమవారం వారు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ 2024 నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యత చేపట్టిన ఎన్టిఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా అనేక అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ఎన్టిఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) పారదర్శకత పరీక్ష నిర్వహణపై ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నీట్ పరీక్ష ఫలితాలలో ఒకే పరీక్ష కేంద్రం గల ఒకే సీరియల్ నెంబర్లతో కూడిన ఉన్న విద్యార్థులకు ర్యాంకులు రావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. లక్షలాది మంది విద్యార్థులు దీనిపై తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేశారన్నారు. దేశ వ్యాప్తంగా సుమారు 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న అంశం కనుక నీట్ పరీక్ష నిర్వహణ ఎన్‌టిఎ వ్యవహరించిన తీరుపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు తుడుం ఎల్లయ్య, పట్టణ సహాయ కార్యదర్శి మహేష్ యాదవ్, పట్టణ కమిటీ సభ్యులు ఉదయ్, నాయకులు కృష్ణారెడ్డి, ఓబులేష్, హాజీ, చైతన్య పాల్గొన్నారు.

ఆర్‌జెడిపై నిందలు వేయడం తగదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విధి నిర్వహణలో నిజాయితీగా వ్యవహరించే విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డిపై కొంతమంది నాయకులు అభాండాలు వేయడం తగదని ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు కత్తి ఓబులేసు తెలిపారు. స్థానిక ఆంధ్రకేసరి రోడ్డులోని ప్రజాసంఘాల కార్యాలయంలో సోమవారం విద్యార్థి యువజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులేసు, రాయలసీమ విద్యార్థి ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్, జిల్లా అధ్యక్షుడు కొడవటిగంటి నాగరాజు, ఏపీ ఎంఆర్పిఎస్ నియోజవర్గ అధ్యక్షుడు గడ్డం నరసింహులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి గత కొంత కాలంగా ఆర్‌జెడి రాఘవ రెడ్డిపై నిందారోపణలు చేస్తున్నారన్నారు. ముక్కుసూటిగా విద్యావ్యవస్థను ఒక పద్ధతిలో గాడిన పెట్టాలని తన ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తున్న ఆర్‌జెడిపై అవినీతి ఆరోపణలు చేయడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో విద్యార్థి యువజన నాయకులు పుల్లయ్య, శేఖర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ యూనియన్‌కు విరాళం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



విరాళం అందిస్తున్న వైఎస్ వెంకటరెడ్డి

స్థానిక ఎస్‌టియు యూనియన్‌కు వైయస్ వెంకటరెడ్డి విరాళాన్ని అందజేశారు. సోమవారం రిలయన్స్ పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న తులసి ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో ఉపాధ్యాయ యస్‌టియు యూనియన్ సభ్యులకు వెంకటరెడ్డి రూ.20 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మంచి చెడులను విద్యార్థి దశ నుంచి వివరించే ఉపాధ్యాయులకు విరాళాన్ని ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఉపా ధ్యాయులు దాదాపీరా, కృష్ణ, దుష్యంత్ నాథ్‌రెడ్డి, కైలాస్ నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

20న జిసిఆర్ఆర్ఎం ఐటిఐలో జాబ్ మేళా

ప్రజాశక్తి - ముద్దనూరు

ఈనెల 20న గజ్జల చిన్న రంగారెడ్డి మెమోరియల్ ఐటిఐలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సుబ్బారావు తెలిపారు. కడపలోని కొప్పర్తి వద్ద ఉన్న ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీ డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్‌లో సిసి కెమెరాల తయారీ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బిటెక్ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. 19 నుండి 32 సంవత్సరాల వయసు వారు అర్హులన్నారు. ఉచిత భోజనం, బస్సు సౌకర్యం ఉందన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని ఆయన కోరారు.